# ప్రయాణానికే జీవితం

## పూనె నుంచి జమ్మూకి మోటార్ సైకిల్ యాత్ర

ఆంగ్లమూలం : అజిత్ హరిసింఘాని

అనువాదం : కొల్లూరి సోమ శంకర్



# ప్రయాణానికే జీవితం

## పూనె నుంచి జమ్మూకి  మోటార్‌సైకిల్ యాత్ర


ఆంగ్లమూలం

**అజిత్ హరిసింఘాని**

అనువాదం

**కొల్లూరి సోమ శంకర్**

# ప్రయాణానికే జీవితం

పూనె నుంచి జమ్మూకి మోటార్ సైకిల్ యాత్ర

# Prayananike Jeevitam

Pune Nunchi Jammuki Motor Cycle Yatra

(Telugu translation of "One Life to Ride" by Ajit Harisinghani)

©English: Ajit Harisinghani
©Telugu: Kolluri Soma Sankar

First Edition: November 2014

No. of Copies: 1000

₹ 120/-

Author's photo by Meena, Juhi, unidentified jawans and others. All other photos including cover photo by Ajit Harisinghani

For eBook and Online Sales: kinige.com

For copies:
All leading Book Shops & Publisher.

Telugu Version Publisher:
**K. Soma Sankar**
1-30-28,
Tirumalanagar, Kanajiguda
Secunderabad 500015
Ph: +919948464365
somasankar@gmail.com

Printed at :
Himalaya Graphics
Chikkadpally, Hyderabad-20. Ph : 040-65552357

ALL RIGHTS RESERVED. Any unauthorized reprint or use of this material is prohibited. No part of this book may be reproduced or transmitted in any form or by any means, electronic or mechanical, including photocopying, recording, or by any information storage and retrieval system without express written permission from the author / publisher.

# ప్రయాణాలను శ్వాసిస్తూ..

ఐచ్ఛికంగా ప్రయాణాలు చేసే ఔత్సాహికుల్లో మూడు రకాల వాళ్ళుంటారు. టూరిస్టులు, ట్రావెలర్లు, ప్రయాణాలకే జీవితాన్ని అంకితం చేసుకున్న వాళ్ళు. ప్రయాణాల గురించి రాసే వాళ్ళల్లో కూడా ఈ మూడు రకాల వారూ మనకు కనబడతారు.

టూరిస్టులు తమకే తెలియని గంతలు కట్టుకుని, గైడు పుస్తకాలూ టూరిస్టు బ్రోషర్లూ చెప్పిన ప్రదేశాలను చూసి టిక్కులు పెట్టుకొంటూ, తమ తమ శక్తిని బట్టో తమను తాము వేసుకునే అంచనాలను బట్టో ఒకటో అయిదో నక్షత్రాల హోటళ్ళలో బస చేస్తూ, వీలయినంత బుద్ధిగా భద్రంగా తమ ప్రయాణాలు చేస్తారు – ముగిస్తారు. ఎవరెస్టు శిఖరం కూడా ఈ టూరిస్టుల తాకిడికి గురి అవడం అన్నది ఆధునిక ఆర్థిక జీవన వైచిత్రి! ఆసక్తి, శక్తి ఉంటే వీరు తమ ప్రయాణాల గురించి టూరిస్టు బ్రోషర్లాంటి యాత్రా వ్యాసాలు రాస్తారు.

రెండో రకం వారు ట్రావెలర్లు. తమ భద్రత గురించి అంతగా పట్టించుకోరు. సుఖమూ సౌఖ్యమూ అంత ప్రధానంగాదు. గమ్యం కన్నా గమనమే ముఖ్యమన్న ప్రాథమిక రహస్యం వీరికి తెలుసు. మనుషుల్నుంచీ, రోజూవారీ జీవితం నుంచీ, ఒత్తిడిల ప్రపంచం నుంచీ పారిపోడానికి వీరు ప్రయాణాలు చెయ్యరు. మనస్సే వీరి చోదక శక్తి. తమ మనసును నింపుకోడానికీ, ప్రపంచాన్నీ ప్రకృతినీ ప్రేమించడానికీ ప్రయాణాలను సాధనంగా వాడుకొంటారు. తమ ఉనికీ, స్థాయి వీరికి ముఖ్యం కాదు. సుఖ సౌఖ్యాలను సాంద్రత నిండిన అనుభవాల కోసం వదులుకోగలరు. వీరిని గుర్తించడం కష్టమేం గాదు. నిశితంగా పరిశీలిస్తే మనకు

కనిపిస్తారు. తమ తమ ప్రయాణాల గురించి వీరు రాసారంటే అది ఏకంగా మనసూ మనసుల మధ్య ఊసులాటే!

అత్యంత అరుదైన జాతి మరొకటుంది. వారికి ఆ స్పృహ ఉన్నా లేకపోయినా – ప్రయాణాలకే వారి జీవితాలు అంకితం. వీళ్ళు ప్రయాణం చేసేది బుద్ధిబలంతో కాదు, మనసు చెప్పినట్టూ కాదు. ఆత్మనిర్దేశమే వీరికి ప్రేరణ. బయట ప్రకృతినీ ప్రపంచాన్ని పలకరిస్తూనే వీరు తమ లోలోపలికి వెళ్ళిపోగలరు. సహ యాత్రికులతోనూ, జీవజాలంతోనూ, చెట్టూ చేమలతోనూ, రాళ్ళూ రప్పలతోనూ, నదులతో, జలపాతాలతో, మబ్బులతో, కొండలతో, గాలితో, వానతో, ఎండతో, చలితో, చలన యంత్రాలతో – చివరికి దుర్గమ రహదారులతో కూడా వీరు సంభాషించగలరు. కావాలనే తమను తాము అసౌకర్యాలకూ, రోతలకూ, అనిశ్చితతలకూ గురి చేసుకొని – వాటిల్లోంచే విలక్షణ అనుభవాలనూ అతి చక్కని జీవిత పాఠాలను గ్రహించి ఇతరులకు అందివ్వగలరు.

వీళ్ళు తమ ప్రయాణాల గురించి రాసారంటే అది తిన్నగా పాఠకుల ఆత్మలను తాకుతుంది. వివరణకూ, వర్ణనకూ అందని అనుభూతిని కలిగిస్తుంది. ప్రపంచాన్ని విభిన్న కోణాలలోంచి, సరికొత్త గవాక్షాలలోంచి చూపుతుంది.

అజిత్ హరిసింఘాని అలాంటి అపురూపమైన యాత్రికుడు.

✤ ✤ ✤

1965లో అనుకుంటాను యు.ఆర్. అనంతమూర్తి "సంస్కార" రాసారు. 1970లో మన పఠాభి సినిమాగా తీసారు. గిరీష్ కర్నాడ్, స్నేహలత నటించారు. ఆ నవలా, ఈ సినిమా సంచలనం సృష్టించాయి. నిషేధానికి దగ్గరయ్యాయి. చివరికి "స్వర్ణకమలం" లభించింది. తర్వాత కొన్నేళ్ళకు గిరీష్ కర్నాడ్ ఓ మాట అన్నారు – "ఆ నవల చూసి ముందస్తుగా విస్తుపోయాను, అబ్బురపడ్డాను. అయ్యో.. ఇది నేనే ఎందుకు రాయలేదా అని మధనపడ్డాను. చివరికి సినిమాకి స్క్రీన్‌ప్లే రాయడమూ, ప్రాణేశాచారి పాత్ర ధరించడమూ ద్వారా ఆ తపన కొంత తగ్గింది."

ఇప్పుడు నేనూ కూడా అలాంటి స్థితిలోనే ఉన్నాను.

నేనూ ఓ ప్రయాణాల పక్షిని. బైకు, కారు, రైలు, విమానం, సైకిలు, నడక – గత నలభై ఏళ్ళుగా తిరగడమే జీవితం. ఓ పది లక్షల కిలో మీటర్లు తిరిగి ఉంటాను. బైకు మీదే పాతిక ముప్ఫైవేలు. నడక మరో మూడు నాలుగు వేలు. ప్రయాణాల గురించి విరివిగానే రాశాను. అనునిత్యం చెయ్యబోయే ప్రయాణాల గురించి ప్రణాళికలు వేస్తూనే ఉంటాను. కలలు కంటూనే ఉంటాను. మనాలీ

నుంచి లడాఖ్ రాజధాని లేహ్ వరకూ మోటారు సైకిలు మీద వెళ్ళడమన్నది నాకు ఇప్పటికీ తీరని కలలలో అతి ముఖ్యమైనది.

అలాంటి నేపథ్యంలో అజిత్ హరిసింఘాని రాసిన "వన్ లైఫ్ టు రైడ్" తెలుగు అనువాదం చదివాను. గిరీష్ కర్నాడ్ నయ్యాను. దీన్ని అనువదించిన కొల్లూరి సోమ శంకర్ ముందుమాట రాయమంటే – అది శశికపూర్ తాను మూడో ఛాయిస్ అని తెలిసి కూడా "దీవార్" సినిమా ఒప్పుకున్నట్లు – వెంఠనే ఎస్సన్నాను.

✤ ✤ ✤

పదేళ్ళ క్రితం నడివేసవిలో నెలరోజులపాటు ఓ స్పీచ్ థెరపిస్టు పూనె నుంచి అహ్మదాబాద్, మౌంట్ అబు, జైపూర్, ఢిల్లీ, చండీగఢ్‌ల మీదుగా హిమాలయ పర్వత పాదాలకు చేరి అక్కడి నుంచి మనాలీ, రోహతాంగ్, కేలాంగ్, దార్చా, పాంగ్‌ల మీదుగా లేహ్ పట్టణానికీ, అక్కణ్ణించి కార్గిల్, ద్రాస్, శ్రీనగర్, పట్నీటాప్‌ల మీదుగా జమ్మూ వరకూ చేసిన నాలుగువేల మూడు వందల కిలోమీటర్ల అద్భుత సాహస యాత్ర ఈ "ప్రయాణానికే జీవితం".

ప్రపంచంలోనే అతి ఎత్తయిన మోటారు బాటలో ప్రయాణం. మరో మూడు వందల డెబ్భై కిలోమీటర్ల వరకూ పెట్రోలేగాదు, నరమానవుడు సైతం అరుదుగా కనిపించే హై ఆల్టిట్యూడ్ ఎడారిలో ఒంటరి యానం. మండే ఎండల ఢిల్లీ నుంచి మంచువానల ఖర్దుంగ్ కనుమ వరకూ పది రకాల వాతావరణాలు. ప్రకృతి శక్తుల ప్రాబల్యాన్ని ప్రత్యక్షంగా అనుభవించడం. తిండీ నీరూ వసతీ వంటి ప్రాథమిక అవసరాలు కూడా తీరకపోగల అవకాశం ఉన్న దుర్గమ ప్రదేశాలు. సముద్రమట్టానికి ఇరవై వేల అడుగుల ఎత్తున ఏ క్షణానైనా హై ఆల్టిట్యూడ్ సిక్‌నెస్‌కి గురిగాగల ప్రమాదం. మంచు కరిగి రోడ్డు మీద రెండడుగుల లోతున ఉధృతంగా ప్రవహిస్తోంటే అందులో దిగి మోటార్ సైకిల్‌తో సహా దిగువనున్న లోయలోకి జారి నామరూపాలు లేకుండాపోగల "మహత్తర అవకాశం". మోహరించిన శత్రు సైనికుల తూటాలను ఆకర్షించే ప్రమాదముందని తెలిసీ ముందుకు సాగడం. మన సైనికులే అయినా కల్లోల లోయలో వారి అనుమానాలకు గురై ప్రాణాలకే ముప్పు తెచ్చుకునే అవకాశం. ఉగ్రవాదుల "ఆతిథ్యం" స్వీకరించే మరో గొప్ప ప్రమాదం పొంచి ఉండడం – ఇన్ని ఉపద్రవాల మధ్య యాభై నాలుగేళ్ళ అజిత్ హరిసింఘాని ఈ ప్రయాణం ఎందుకు తలపెట్టినట్లు?

ఆయనకు ప్రయాణమే జీవితంగాబట్టి.

✤ ✤ ✤

మనసూ, ఆత్మల ప్రేరణతో ఓ సుదీర్ఘ ప్రయాణానికి తలపడడం ఒక ఎత్తు, తన మనసంతా వ్యక్తపరుస్తూ, ఆత్మనివేదన చేసుకొంటూ – తన భావాలనూ, అనుభవాలనూ అక్షర రూపంలో పెట్టి సమ హృదయులతో పంచుకోవడం మరో ఎత్తు. అదిగో ఆ పని అజిత్ హరిసింఘాని అత్యంత హృద్యంగా చేసారీ పుస్తకంలో.

తన దగ్గర చికిత్స పొందుతున్న ఓ జెరిమీ డి కోస్టా గారు తనలో ప్రవేశపెట్టిన సుదీర్ఘ బైకు ప్రయాణపు బీజం గురించి చెబుతారు అజిత్. రాబోయే బృహత్తర యాత్రకు నాందీ ప్రస్తావనగా తాను చేసిన వెయ్యి కిలోమీటర్ల గోవా ప్రయాణం గురించి వివరిస్తారు. ఆ తర్వాత ఈ మహాయాత్రకు తనను మానసికంగా శారీరకంగా సిద్ధం చేసుకోవడం, తన పదహారేళ్ళ పురాతన ఎన్‌ఫీల్డ్ బైక్‌ను సర్వసంసిద్ధం చేయడం, ఆచితూచి ప్రయాణానికి అవసరమయ్యే అనేక వస్తువులను ఎంపిక చేసి సర్దుకోవడం, బైక్ రిపేరింగ్ నేర్చుకోవడం, ఇంటర్నెట్‌లో అవసరమైన సమాచారాన్ని సేకరించడం, మరో నలుగురు ఔత్సాహితులతో బృందంగా ఏర్పడటం – ఇవన్నీ ఏ మాత్రం విసుగు పుట్టించకుండా, ఎంతో ఆసక్తికరంగా చెప్పుకొస్తారు అజిత్. పూనె నగరంలో 10 జూన్ 2004 ఉదయాన ప్రయాణం ఆరంభించిన క్షణం నుంచీ మరో నెల తర్వాత తిరిగి పూనెలో అడుగుబెట్టే వరకూ పాఠకులను తన మోటారు సైకిలు వెనుక సీటు మీద కూర్చోబెట్టుకుని తనతో తీసుకు వెళ్ళిపోతారు.

కానీ ఏమాటకామాట చెప్పుకోవాలి –

ఇలాంటి యాత్రలు చేసిన వాళ్ళలో అజిత్ మొదటి మనిషి కాదు, ఆఖరి మనిషి కానే కాదు. ప్రతీ ఏడాదీ పదులకొద్దీ దేశవిదేశీ సాహసికులు మనాలీ నుంచీ లేహ్ వరకూ బైకు మీద వెళుతూనే ఉంటారు. మరి మనం ఈయన యాత్రనే ఎందుకు విలక్షణంగా భావించాలీ? ఆయన యాత్రాగాథనే ఎందుకు శ్రద్ధగా చదువుకోవాలీ?

కారణముంది – మనకి తెలియని అనేకానేక సజీవ వ్యక్తులనూ, ప్రాణం లేని శక్తులనూ, ఆకృతి లేని ఆలోచనలనూ, పంచేంద్రియాలకు అందని అనుభూతులనూ మనకు పరిచయం చేస్తారు గాబట్టి, సన్నిహితం చేస్తారు గాబట్టి.

గోవా అరంబోల్ బీచ్ దగ్గర పేదరికంతోనూ, సూకరాలతోనూ సహజీవనం చేస్తోన్న పెద్దావిడ మనకు ఆత్మీయురాలవుతుంది. సందర్భోచితంగా కథనంలో పొందుపరిచిన విపశ్యన అకాడమీలో దశ దిన మౌన దీక్షలో మనమూ పాల్గొంటాము. ఫ్లాష్‌బాక్‌లో అజిత్ వాళ్ళ అమ్మగారు చెప్పిన గైబీ ఖాన్ ఉదంతం, మన అనుభవమే అనిపిస్తుంది. "పాలీ" దగ్గర తటస్థపడిన – సైకిల్ మీద మక్కా యాత్ర పెట్టుకొన్న – సూఫీభాబాలో మారువేషంలో తిరుగుతున్న అసలు సిసలైన

సూఫీ చక్రవర్తిని మనమూ చూస్తాము. ఏ దుష్ప్రేరణా లేకుండానే బరోడా టోల్‌గేట్ దగ్గర మహా దురుసుగా మాట్లాడిన మధ్య వయసు కారారూఢ దంపతులు ఆరే ఆరు తూటాల్లాంటి మాటలతో జావగారిపోయి జీవకళ కోల్పోయి తోకముడవడం చూస్తాం. నరసంచారం అరుదుగా సాగే "పాంగ్" అనే ప్రదేశంలో గుడారాల హోటలు నడిపే టిబెట్టు మహిళ తన ఏడాది బాబు కోసం సన్నగా, చిన్నగా, హాయిగా, మార్దవంగా, ప్రశాంతంగా పాడే లాలిపాట వింటాం. ఖర్దుంగ్ కనుమ దగ్గర రెండడుగుల లోతున పెద్దపెద్ద బండరాళ్ళ మీద ప్రవహిస్తోన్న ఓ వడివడి వాగులో చిక్కడిపోతాం. గోవావాళ్ళు, మహారాష్ట్రీయులు, గుజరాతీలు, కన్నడిగులు, కేరళీయులు, పంజాబీలు, హిమాచలీయులు, కాశ్మీరీలు, బీహారీలు, జర్మన్లు, ఇజ్రాయెలీలు, అమెరికన్లు, బ్రిటీషర్లు – అనేకానేక వ్యక్తులతో పరిచయాలూ, స్నేహాలూ ఏర్పరుచుకొంటాం. లేహ్ దగ్గరి "హెమిస్" ఉత్సవంలో పన్నెండేళ్ళ కొకసారి మాత్రమే ప్రదర్శించే థంగ్కాని చూస్తాం. సియాచిన్ గ్లేషియర్ దగ్గరి హుందర్ గ్రామంలో సెరింగ్ అనే గ్రామీణుడి ఆతిథ్యం పొందుతాం. నా వరకూ నాకు పుస్తకం ముగించాక, "జెన్ అండ్ మోటర్ సైకిల్ మెయిన్‌టెనన్స్", "మోటర్ సైకిల్ డైరీస్" అన్న పుస్తకాలు అప్రయత్నంగా గుర్తొచ్చాయి.

అజిత్ తన యాత్రలో కష్టాలు పడ్డారా? దుస్సాహసాలు చేసారా??

చెప్పడం కష్టం. సమాధానం మన మన మనోప్రవృత్తి మీద ఆధారపడి ఉంటుంది. కానీ ఒక్క మాట. తన మీద తానే కొంటె కామెంట్లు వేసుకునే వ్యక్తిని ప్రపంచంలోని ఏ శక్తీ కష్టాలకు గురిచెయ్యలేదు. అజిత్‌లో ఈ హాస్యస్ఫూర్తి అపారం. ఆది నుంచి అంతం దాకా అది మనకు అడుగడుగునా తటస్థపడి చిరునవ్వులు మొలకెత్తిస్తుంది. అలాగే ఆయన కాశ్మీరు లోయలో దినదిన గండంగా గడుపుతోన్న యువ మరాఠా రెజిమెంటు సైనికులను చూసి ఏకధారగా కంటతడి పెట్టినపుడు మన మనసూ చెమరుస్తుంది. అనిర్వచనీయ సౌందర్యం గల ప్రకృతిలో తానూ ఓ భాగమైపోయి అజిత్ కవితా ధోరణిలో పడిపోయినప్పుడు మనమూ కవులయిపోతాం. రచయిత – తన హృదయ స్పందనను మోటార్ సైకిల్ విస్పందనలతో అనుసంధానించినట్టుగా (ఒక గుండె స్పందన సమయం నాలుగు బైకు విస్పందనలకు సమానం) – చదువరుల హృదయస్పందనలతోనూ అతి సులభంగా జతబడిపోతాడు. ముళ్ళపూడి వారి "రెండు హృదయాలు ఒకే పంథాన స్పందించడమే ప్రేమ" అన్న నిర్వచనం నేపథ్యంలో మనమూ అజిత్ గారితోనూ, వారి ఎన్‌ఫీల్డ్ తోను ప్రేమలో పడిపోతాం.

✤ ✤ ✤

స్వీయ రచనలు స్వకాయ ప్రవేశమయితే, అనువాదం పరకాయ ప్రవేశం.

అందులోనూ అనువదిస్తోన్న విషయంలో ప్రత్యక్ష అనుభవం, అనుభూతి లేనప్పుడు అది మరింత కష్టమైన ప్రక్రియ అవుతుంది. అజిత్ హరిసింఘాని వెళ్ళిన అన్ని ప్రదేశాలకూ కేవలం ఊహాబలంతోనే వెళ్ళడం, వర్ణించిన అన్ని వివరాలనూ భావనాబలంతోనే గ్రహించి తెలుగు చెయ్యడం, ఇంగ్లీషు నుడికారానికి అన్యాయం చెయ్యకుండానే అతి చక్కని తెలుగు నుడికారాలను అనువాదకుడు సమయోచితంగా వాడటం – పాఠకులకు సౌకర్యాన్నీ సంతృప్తినీ కలగజేస్తాయి. మూల రచయిత కవి హృదయానికి దీటుగా పదగుచ్ఛాలను రూపొందించడం "వహ్వా" అనేలా చేస్తుంది. "నక్షత్ర ఖచిత వినీలాకాశం", "గతాన్ని గుత్తగా గంపకెత్తడం..." "ఉనికిలేనితనపు విలక్షణత" లాంటి ప్రయోగాలు ఏ మూలభాషకైనా ఆభరణాలు. వాటిని అనువాదంలో పొందుపరిచిన సోమ శంకర్‌ని అభినందించకుండా ఉండలేం. అనువాదమన్న అనుమానం ఎక్కడా కలగకుండా హైవే మీద ప్రయాణమంత సాఫీగా సాగిపోయే కథనం పాఠకులకు హాయిగొలుపుతుంది.

✤ ✤ ✤

సుఖాల గురించీ, ప్రయాణాల గురించీ, ప్రదేశాల గురించీ, జీవితాల గురించీ, మానవాళి గురించీ, ప్రపంచ గురించీ మనకుండే అవగాహనను సమూలంగా ప్రశ్నించి, శీర్షాసనం వేయించగల శక్తి మీ చేతుల్లో ఉన్న పుస్తకానికి ఉంది.

ఇంకా ఆలస్యమెందుకూ... ప్రయాణం ఆరంభించండి మరి!

**దాసరి అమరేంద్ర**

30 సెప్టెంబర్ 2014

న్యూఢిల్లీ

# విషయ సూచిక


నాంది ........................................ 13

సమ్మోహన బంధం ........................................ 17

నిరాశ చెందిన ఆరంబోల్ సూకరాలు ........................................ 20

సన్నాహాలు ........................................ 31

సైనిక శాసనం ........................................ 36

ప్రస్తుతానికి దహోనులో ........................................ 43

ఆరు పదాలు చాలు ........................................ 52

సూఫీబాబా ........................................ 67

జడలబర్రె నెయ్యి – యజ్ఞం కోసం ........................................ 72

వంటగది, వానరాలు ........................................ 77

రోహతాంగ్ కనుమ దాటి ........................................ 90

లేహ్ చుట్టుపక్కలా ........................................ 105

అద్భుత పర్వతం ........................................ 114

నడిరోడ్డు నదిలో... ........................................ 125

లమయూరు వజ్రం ........................................ 131

'జోజిలా' కి అటూ ఇటూ ........................................ 140

కన్నీళ్ళ లోయ ........................................ 144

అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి ........................................ 158

ముగింపు ........................................ 167

# నాంది

**జె**రెమీ డీ కోస్టాది స్ఫురద్రూపం. పక్షవాతం వల్ల కాళ్ళుచేతులు పడిపోయినా, మాట దాదాపుగా పోయినా కూడా ఆయనతో ఉండడం బావుంటుంది. నల్ల మెర్సిడెస్ కారు వెనుక సీట్లోంచి దిగుతూ, తనకి ఆధారంగా ఉన్న నాలుగు కాళ్ళ వాకింగ్ స్టిక్‌ని ఆయన పట్టుకున్న తీరు ఎంతో హుందాగా ఉంటుంది. క్లినిక్ ప్రవేశ ద్వారం వైపు అడుగులు వేయడంలో ఇబ్బందులు ఎదుర్కుంటున్నా, ఆయనలో ఎంతో దర్జా! ఆయన పొడగరి, రంగు చామనచాయ. వినయశీలి. ఆయన ధరించే ఖరీదైన బ్రాండెడ్ దుస్తులు చెప్పకనే చెబుతాయి.... ఆయనెవరో. కార్పోరేట్ ప్రపంచంలో విజయవంతమైన, నాగరిక వర్తనం కలిగిన వ్యక్తిగా సులువుగా పోల్చుకోవచ్చు. ముఖ సంబంధమైన పక్షవాతం ఆయన ముఖాకృతిని దారుణంగా మార్చేసినప్పటికీ, ఆయన మంచి రూపసిగాను, దయాళువుగాను కనపడుతారు.

ఏస్ ఎలెక్ట్రోడ్స్ అనే సంస్థకి సి.ఇ.ఓ అని ఆయన విజిటింగ్ కార్డుపై ఉంటుంది. కానీ పక్షవాతం సోకిన తర్వాత కార్యభారమంతా ఆయన సహచరుడు దేశాయ్ స్వీకరించారు. అది తాత్కాలికమేనని, డీ కోస్టా కోలుకోగానే ఆయనే బాధ్యతలు చేపడతారని దేశాయ్ అంటారు.

అయితే, ఆయన కోలుకుని తిరిగి ఆఫీసుకి వెళ్ళడమనేది కలేనని స్పీచ్ థెరపిస్ట్‌గా నాకు తెలుసు.

పక్షవాతం ఆయనని బాగా కృంగదీసింది. శారీరకంగా కుడి వైపు అవయవాలని పనిచేయకుండా చేయడంతో పాటు, మెదడులోని – భాషకి, వాక్కుకి సంబంధించిన – నాడీవ్యవస్థని దెబ్బతీసింది.

ఆరు నెలలు సాగిన స్పీచ్ థెరపీ సెషన్స్ ఆయన తన భావ ప్రకటన శక్తిని కొద్దిగానైనా తిరిగి సాధించడంలో తోడ్పడ్డాయి. కానీ చికిత్స ఇంకా చాలా కాలం కొనసాగాల్సి ఉంది. ఒకప్పుడు అతి క్లిష్టమైన ఆర్థిక గణాంకాలను చేతి వేళ్లపై గణించిన వ్యక్తి, ఇప్పుడు చిన్న అంకెలను కూడా అతి కష్టం మీద కూడగలుగు తున్నారు. ఒకప్పుడు తన మేధోపూరితమైన, చతురమైన సంభాషణలతో ధనికులను, విశిష్ట వ్యక్తులను విశేషంగా ఆకర్షించిన మనిషి ఇప్పుడు సులువైన చిన్న చిన్న పదాలతో వాక్యాలను కూర్చడంలో సైతం ఇబ్బంది పడుతున్నారు. అయితే ఆయన ఇప్పుడు కచ్చితంగా మెరుగవుతున్నారని చెప్పచ్చు... ఎందుకంటే స్పీచ్ థెరపీ జరిగిన మొదటి రెండు నెలల్లో అసలు ఒక్క మాట కూడా మాట్లాడలేక పోయారు.

మెదడుకి సోకే పక్షవాతం తరచుగా మేధస్సుకి సంబంధించిన పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆలోచనాపటిమ సన్నగిల్లుతుంది. గణాంకాలను విశ్లేషించే సామర్థ్యం క్షీణిస్తుంది, భావోద్వేగాలు ఒకే రీతిలో ఉండవు. ఇలా వ్యక్తిత్వానికి సంబంధించిన ఎన్నో అంశాలు తారుమారవుతాయి. తమకు తెలిసిన పాత వ్యక్తి స్థానంలో ఈ కొత్త వ్యక్తిని చూడడం కుటుంబ సభ్యులకు కష్టమవుతుంది. డీ కోస్టా కొడుకులిద్దరూ విదేశాలలోనే ఉన్నారు. అంచేత ఆయన సంరక్షణా భారమంతా భార్య ఎస్తర్‌పై పడింది. అరవై ఏళ్ళ వయసులోనూ ఆమె ఓ త్యాగాళువులా అంకితభావంతో తన భర్తకి సేవలందిస్తున్నారు. ఆయన మందు బిళ్ళలు సకాలంలో వేసుకునేడట్లు చూడడమే కాకుండా, వారంలో ఒకసారి ఆసుపత్రికి పరీక్షలకు తీసుకెళ్ళడం, డాక్టర్లు చెప్పినవి తప్ప, మిగిలినవేవి ఆయన తినకుండా చూడడం ఆమె బాధ్యత. పాత్రలు మారాయి కదూ! ఆధిపత్యం చలాయించిన పురుషుడు ఇప్పుడు విధేయుడయ్యాడు, మార్పుని అంగీకరించడానికి సమయం కావల్సివచ్చింది. ఒకప్పుడు తన స్వతంత్ర్యత గురించి ఎంతో గర్వపడ్డ డీ కోస్టా – ఇప్పుడు తనకి సంబంధించిన అంశాలపై తన భార్య నిర్ణయాలు తీసుకుంటోందనే వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. టాయిలెట్‌కి వెళ్ళడం నుంచి, బట్టలు వేసుకోడం వరకూ అన్నింటిలోను ఆమె సాయం తీసుకోవాల్సి రావడం ఆయనకి కష్టంగా ఉంది.

సుదీర్ఘమైన, అవిశ్రాంతమైన ఒత్తిడి ఆమెపై కూడా ప్రభావం చూపసాగింది. ఆమె మానసిక విఘాతానికి చాలా దగ్గరయింది. ఎల్లప్పుడూ ఉత్సాహంగా ఉండే తన భార్య ఈ స్థితికి రావడానికి తనే కారణమని డీ కోస్టా తనని తాను నిందించుకుంటూంటారు. కొద్దికొద్దిగా మాటలు పెగలగానే, తన అపరాధ భావాన్ని, తన బెంగని ఆయన వ్యక్తం చేసేవారు. తన నిరాశానిస్పృహలను ఆయన

దూరం చేసుకునేందుకు వీలుగా ఆయన చెప్పేవన్నీ నేను శ్రద్ధగా వినేవాడిని, ఆయన తన గురించి మంచి మాటలు చెప్పుకునేలా దారితప్పించేందుకు ప్రయత్నించేవాడిని. క్రమంగా ఆయనకు తన వైకల్యం తీవ్రత అర్థమవసాగింది, ఈ అవగాహన ఆయనని కంటనీరు పెట్టించేది. విసుగు, కోపం, నిస్సహాయతల వలన కలిగిన అశ్రువులవి.

డీ కోస్టా ఎటువంటి సంకోచ బిడియాలు లేకుండా మాట్లాడడం మొదలుపెట్టారు, కానీ అందరితోనూ కాదు.

ఆయన చిన్న చిన్న పదాలను కూర్చుతూ తన భావాలను స్వేచ్ఛగా పంచుకునే వ్యక్తిని ప్రపంచంలో నేనొక్కడినే. ఆయన మాట ఓ పొసగని పాటలాంటిది, వాక్యం మధ్యలో తన ఆలోచనల క్రమాన్ని కోల్పోయేవారు. అలాంటి సందర్భాలలో క్షమాపణ చెప్తున్నట్లుగా నవ్వేవారు.

“డాక్టర్, ఈ రోజు... కాదు... నిన్న..... మిస్టర్ సిన్హా ...అశోక్.... సాయంత్రం...” అని ఆయన చెబితే, ముందు రోజు సాయంత్రం ఆయన ఆఫీసు సిబ్బంది ఎవరో వచ్చి ఆయనను కలిసారని నాకర్థమయ్యేది. అయితే నేనీ విషయాన్ని ఎస్తర్ గారితో నిర్ధారించుకునేవాడిని. అలాంటప్పుడు, నిజానికి వారు మరుసటి రోజున రాబోతున్నారని తెలిసేది.

❖ ❖ ❖

మరికొన్ని వారాలు గడిచేసరికి, ఆయనలో గణనీయమైన మార్పులు కనబడ్డాయి. మౌఖిక వ్యక్తీకరణ చాలా మెరుగయింది.

ఇటీవలి జ్ఞాపకాలు మరుగునపడిపోయి, పాత జ్ఞాపకాలు మళ్ళీ గుర్తుకురావడమనేది పక్షవాతానికి గురైన వ్యక్తులలో సర్వసాధారణమే.నేను ఆయన విద్యార్థి జీవితం గురించి ప్రశ్నలడిగేవాడిని, ఆయన తన విద్యార్థి దశని జర్మనీలో గడిపారని నాకు తెలుసు. తను కలిసిన జర్మన్ యువతుల గురించి ఆయన చెప్పేవారు. తన బి.ఎం.డబ్ల్యూ మోటార్ సైకిల్‌పై తన నేస్తం ఇన్‌గ్రిడ్‌ను దక్షిణ ఇటలీ అంతా తిప్పడం గురించి చెప్పారు.

నాకు నా ఎన్‌ఫీల్డ్ లానే, తన బి.ఎం.డబ్ల్యూ అంటే ఆయనకెంతో ప్రాణం. మా ఇద్దరి అభిరుచులు కలిసాయి, ఇది చికిత్సలో ఉపయోగపడింది. ఆరు నెలల తర్వాత, డీ కోస్టా సంపూర్ణంగా కోలుకోకపోయినప్పటికీ, ఓ ఏడాది పాటు తన కొడుకు వద్ద ఉండడం కోసం పూనె నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోకి బయల్దేరారు. అక్కడ పక్షవాత రోగుల చికిత్సకై పేరుపొందిన ఓ పునరావాస కేంద్రం ఆయన కేసుని విశ్లేషించి, మెరుగైన చికిత్స కోసం తీసుకోవాల్సిన తదుపరి చర్యలను సూచించడానికి అంగీకరించింది. ఈ కేంద్రం సూచించిన చర్యల వల్ల గతంలో

ఇటువంటి సంక్లిష్టమైన స్థితిలో ఉన్న రోగులెందరో కోలుకున్నారు.

నా క్లినిక్‌లో చివరి సెషన్‌కి వచ్చినప్పుడు డీ కోస్టా నాకో కానుక తెచ్చారు. పారిశ్రామికవేత్త, దార్శనికుడైన వైమానిక రంగ నిపుణుడిగా, వేగంగా కారు నడిపే రేసర్‌గా, మహిళలను మైమరపింపజేసే వ్యక్తిగా పేరు గాంచిన జె. ఆర్. డి టాటా రాసిన "కీనోట్" అనే పుస్తకం అది. జె. ఆర్. డి టాటా అంటే నాకెంతో గౌరవం. జె.ఆర్.డి టాటాని డీ కోస్టా ఎన్నోసార్లు కలిసారు, ఆయనలానే నేను కూడా జె.ఆర్.డి టాటాకి వీరాభిమానిని. ఆ పుస్తకాన్ని తెరచి ఓ చోట పసుపు రంగుతో గీసి ప్రత్యేకంగా పేర్కొన్న ఓ వాక్యాన్ని చూపించారు:

***..... జీవితాన్ని కాస్త ప్రమాదకరంగా గడిపితే ఆనందం, ఆత్మఫలసిద్ధి లభించాయి.***

''డాక్,''...అని మెల్లిగా మాట్లాడానికి శ్రమిస్తూ...., ''నేను.... వెడుతున్నాను...'' అని అన్నారు.

"అక్కడి అమెరికన్ యువతులతో సరదాగా గడపుతారులెండి" అన్నాన్నేను మాటలకి తడుముకోకుండా. ఇలా అనాలోచితంగా పలికే సరసోక్తులు ఆయన మోముపై నవ్వు తెప్పిస్తాయి.

"ఎప్పుడైనా..... దేనికైనా.... సాహసం... నా కోసం.... మోటార్ సైకిల్....."

ఆయన అడుగుతున్నదేమిటో నాకర్థమయింది. మేము తరచూ అనుకునే నా పర్యటన గురించి. దేశంలోని ఈ చివరి నుంచి ఆ చివరి దాక మోటార్ సైకిల్‌పై పర్యటించాలనేది నా కోరిక.

"తప్పకుండా. మిస్టర్ డీ కోస్టా. మీ కోసం... నా కోసం నేనా యాత్ర చేస్తా"

ఆయన సక్రమంగా ఉన్న తన ఎడమ చేయి చాచి, నాతో కరచాలనం చేసారు.

"క్షేమంగా వెళ్ళిరండి" అంటూ ఆయనని నేను కారు దాకా సాగనంపాను. అదే చివరిసారయ్యింది.

మూడు రోజుల తర్వాత, మర్నాడే అమెరికాకి ప్రయాణమవుతారనగా, డీకోస్టా నిద్రలోనే కన్నుమూసారు. చనిపోయినప్పుడు ఆయనెంతో ప్రశాంతంగా ఉన్నారని ఆయన భార్య తెలిపారు.



**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Prayananike+Jeevitam**

* * *